
# ఎదురీత

కోసనం మహేశ్వరరావు




చీకటి నలు మూలలా తాండవిస్తున్నది. కీచురాళ్ళ ధ్వనులు భయం గొల్పుతున్నాయి. తీతువు పిట్ట గోలపెడుతున్నది. ఊరి చివర పంచాయతీ వీధి దీపం వెలగలేక వెలుగుతున్న ది. దూరంగా స్మశానంలో నక్కలు భాగాలు తెగక పోట్లాడుకుంటూ అరుస్తున్నాయి. చలి ఎముకలను కొరికివేస్తున్నది.

సాధారణంగా చీకటి పడితే ఆ ప్రాంతాల కెవరూ రారు. కానీ ఆరోజున ఆ దీపస్తంభం దగ్గరగా ఒక స్త్రీ ఎండు గడ్డి పరకలను పోగు చేస్తున్నది. చలి కాగాలని ఆమె ప్రయత్నం. గడ్డి కుప్పగా వేసింది. వెలిగించడానికి అగ్గిపెట్టె లేదు. ఆ వీధి లాంతరుతో మంట వేసుకోవచ్చు ననుకుంది. స్తంభం ఎక్కబోయింది. కాలుజారి పడింది. మొనగల పెంకుముక్కలు, రాళ్ళు చిన్న చిన్న గాయాలను రేపాయి ఆమె వంటి మీద. తిరిగి దీప స్తంభం ఎక్కింది చెమ్మరికిన రక్తాన్ని చీరకొంగుకు తుడుచు కొంటూ; విడిన జుత్తుముడి సరిచేసుకొంటూ; దీపం చేత పట్టుకొంది. చేయి వణికింది. చేత దీపం జారి కింద పడింది. ఆ పడడంతో బర్నరు ఒదులై కిరసనాయిలు ఆమె బట్టలమీదా, క్రింద నేలమీద అంతా ఒలికిపోయింది. చిమ్నీ తునా తునకలై పోయింది. ఒత్తి అంతా అంటు కుంది. క్రింద పోగుచేసిన గడ్డి మండటం ప్రారంభ మైంది. మంట బాగా రేగింది. రేగినమంట ఆమె చీర నల్లుకొంది. గుండెలో ఏదో భయం మొదలింది. కళ్ళు బైర్లు కమ్మాయి. కాళ్ళూ, చేతులూ పట్టు తప్పాయి. చిమ్నీ ముక్కలు గుచ్చుకొన్నాయి.

చీర కాలిపోతున్నది.

'అయ్యో! భగవంతుడా.,.....' అని ఆమె ఆక్రందిస్తున్నది. పరిసరాల్లో ఎవరూ ఆమె ఆక్రందనను వినగలిగేవారులేరు. చీర తియ్యా లనుకొంది. కానీ నగ్నంగా ....ఎలా అని తట పటాయించింది. అగ్ని తన పని తాను చేసుకు పోయింది. పూర్తిగా మాడి మసీ అయిపోతే మంచిదని అనుకొంది మరల.

తనెందుకు బ్రదకటం ? ఎవరికోసం? ఎందుకు ??? అనుకొన్నది. ఒక ప్రక్క భౌతి కంగా ఆమెకు బాధ కలుగుతున్నా అంతరంగికంగా ఎందుకో నవ్వుకొంది.

ఒళ్లంతాకాలి నల్లబడిపోయింది. ఆమె రూపమే పూర్తిగా మారిపోయింది. ఒళ్లంతా బల్లేలతో పొట్లు పొడవబడుతున్నంత బాధ పడుతున్నది.

ఎవరో బాటసారి ఆమె మూల్గు విని ఆమెను సమీపించాడు. నక్షత్రాల మసక కాంతిలో ఆమె రూపం చూచి భయపడ్డాడు. తన దారిన తాను వెళ్లబోయాడు.

'బాబూ' మూల్గుతూ అస్పష్టంగా పిలిచింది.

తిరిగి ఆమెవైపు రెండడుగులు వేశాడు, భగ్న, నగ్న దేహాన్ని చూచి చూడలేక కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. ఏమిది ఏదైనా పిశాచి గానీ కాదు గదా అని భయపడ్డాడు. కళ్ళు తెరువకుండానే పరుగెత్తుకు పోవాలని పెద్ద అంగలు వేయబోయాడు. కాళ్ళు కలరలేదు. తన కాళ్లనెవరో సంకెళ్లతో బంధించినట్లు ఒక అడుగు కూడా ముందుకు వేయలేకపోయాడు.

'బాబూ ! అలా నిలబడిపోయారేం?.

అబ్బ. . . నా జీవిత చరమ ఘడియలు. . . చూడలేను ఎవరినీ అనుకున్నాను. . .కానీ మీరెవరో. .నాపాలిట దేవదూతలా. . .వచ్చారు. ఆమె మూల్గుతూ చెప్పుకుపోతున్నది.

ఆ బాటసారి మనసు కొంత కుదుట పడింది. దీర్ఘ నిశ్వాసం విడిచి కొంత స్థిమితపడి 'అమ్మయ్య' మనిసే అనుకొన్నాడు. 'ఎవరా స్త్రీ? ఎందుకిక్కడ పడివుంది. . . ఎంతగానో యోచించడం మొదలెట్టాడు. తనపై కండువాను ఆమె మీదకు విసిరాడు.

ఆమె గతాన్నొకసారి స్మరణకు తెచ్చుకుంది. ఆమె కోర్కెలు, ఆశలు ఫలించినట్లయితే తన జీవితం ఇలా సమాప్తమయి వుండేది కాదని అనుకొంది. పెదవుల మీదకు పేలవమైన నవ్వుతెర వచ్చింది.

. . . .ఆమె నారాయణను మనసారా ప్రేమించిది. నారాయణ కూడా తనను ప్రేమించాడు. కాని తన తల్లిదండ్రులు అందుకు అంగీకరించలేదు. అతని తల్లిదండ్రులు ససేమిరా కుదరదు అన్నారు. ఏది ఎలా ఉన్నా నారాయణ ఖచ్చితంగా విన్నే పెళ్లి చేసుకొంటానని బాసచేసి ఆమెను దూరం ఆలోచించనీయలేదు. అంతకంటే తనకేం కావాలనుకొంది. ఆమెలోని కోర్కెలు మరింత బలపడినాయి. సమాజాన్నెదిరించియైనా తాము దంపతులము కావాలనీ, మనసులు కలిసిన దాంపత్యం స్వర్గసీమగా ఉంటుందనీ ఆశించింది. ఎవరితో తమకేం పని.. తను వివాహం కావటం ముఖ్యం అనుకొంది.

వూళ్లోనెందుకు గొడవ, పట్నం వెళ్లి పెళ్లి చేసుకొని సుఖంగా ఉందామన్నాడు నారాయణ. ఆమె మనస్సు ఆనందంతో పరుగులెత్తింది. వేడి కోర్కెలతో ఉన్న ఆమెకు అతని సలహా బావుందనిపించింది. సరేనన్నది.

ఒకనా డిద్దరూ రహస్యంగా పట్నం చేరుకున్నారు.

గింతకుతగ్గ బొంతలా ఒక ఇల్లు చూచుకున్నారు. నారాయణ దగ్గర ఉన్న కొద్ది డబ్బూ హారతి కర్పూరంలా హరించింది. అతనికి తగిన పనీ పాటా ఏమీ దొరికింది కాదు. చల్లచల్లగా ఆమె దగ్గర ఉన్న చిల్లర మల్లర వంటిమీది నగలు కూడా హరించాయి.

నారాయణకు ఆమెపై రోజురోజుకూ ప్రేమకు బదులు ఏహ్యాభావం పెరుగుతూ వచ్చింది. వేళకి సరిగా తిండికి గడవడం కూడా గగనమైపోతున్నది. అతనేం పని చేయడు. ఏమిటీ అంటే తనకు తగిన పని దొరకలేదంటాడు. సరైన ప్రయత్నం కూడా ఏమీ అతను చేసింది లేదు.

ఆమెకేం పాలుపోవటంలేదు. ప్రేమ అంటే ఇదేనా. ఇలాగే ఉంటుందా? మకరందాన్ని గ్రోలిపోయే తుమ్మెదల్లా యవ్వన మాధుర్యం ఆస్వాదించడం కొరకు చెప్పే మాటలుగా, తేనె పూతలుగా, కట్టు కథలుగా, నాటకంగా ఆమెకు తోచింది. తమ ప్రేమ అంటే జీవిత మంతా ఒక మధుర స్వప్నంగా, ఆదర్శవంతంగా, ఆనందంగా గడిచిపోయేట్లు చేయగల కల్పతరువులాంటి దనుకొంది. గాలి మేడలు కట్టుకొంది. వాటి అర్థం రోజు రోజుకూ విరుద్ధంగా ఆమె అనుభవిస్తూంటే ఏమిటా అని కంగారు పడింది. తీవ్ర వేదన పడింది. నారాయణ ఆమెపై చేయి చేసుకున్నప్పుడు, ఇష్టం వచ్చినట్లు తిట్టినప్పుడు 'మరి నన్నెందుకు నమ్మించి ఇలా చిత్రహింస చేస్తారు? ఇంత ద్రోహం చేస్తారేమి? ఇదేనా మన ప్రేమ? ఒకసారి నా గొంతు నులిమేస్తే క్షణంలో మీ పీడ వదిలిపోతుంది. అని బావురుమని ఏడ్చేది.

'ఛీ, ఛీ, శనిగ్రహంలా నా పాలిట తయారయావు. నీ మూలంగానే నాజీవితం నాశనం అయింది. ఇంకా నన్ను బెదరిస్తున్నావా' అని మరిరెండు అంటించేవాడు.

అప్పు డామెకూ కోపం వచ్చేది. మీ మూలంగానే నా జీవితాన్ని నాశనం చేసుకున్నాను. నరకతుల్యం చేసుకున్నాను. మీ మాటలు నమ్మాను. మీ నీడను ఎన్ని కష్టాలనయినా ఆనందంగా అనుభవించవచ్చుననుకున్నాను. కానీ. . . ఇలా జరుగుతుందని వూహించనైనా లేకపోయాను. మీతో 'ప్రేమ' అనే దివ్య పదానికి సార్థకత లభించగల శక్తి ఉందని భ్రమించాను. ఇంత పిరికిపంద లౌతారని అనుకొనలేదు. నా జీవితాన్నే ఈ విధంగా బలి చేస్తారా? నన్నో పనిముట్టుగా, మీ వాంఛలను తీర్చుకొన్ని బానిసనుగా భావించారు?, ఆవేశం పొంగినప్పుడు కన్నీరు బొటబొట కారుస్తూ విలపించేది.

అతనిలో ఏమీ మార్పు రాలేదు. మరింత క్రూరంగా ప్రవర్తించడం ప్రారంభించాడు.

ఆమె బ్రతుకే నరకకూపంగా మారింది.

గత్యంతరం ఏమిటి? తిండికి కూడా మోహం వాయాల్సిన స్థితి సంభవించింది. పస్తులెక్కువైపోయినాయి. దానికితోడు నారాయణ క్రూర ప్రవర్తన. ఎక్కడెక్కడో అతను తిరుగుతూ ఇష్టమొచ్చినప్పుడు విచారపు మోహంతో ఇల్లు చేరుకునేవాడు. ఏమిటి తన జీవితం? ఇంత పీడకలగా మారిపోయింది. ఈ కొద్ది రోజుల నూతన జీవిత పథంలో తనలో ఎంత మార్పు. నిండుగా నవ్వి పరిమళాన్ని వెదజల్లే గులాబి నేడు వాసన కోల్పోయి రేకలూడి ఎప్పుడో ఒకప్పుడు నామరూపాల్లేకుండా పోయే స్థితి ఏర్పడింది.

శేష జీవితాన్నంతా ఇలాగే గడపాలా? ఒకవేళ తనను ఒంటరిగా వదిలిపోతే అతను? వడలు కంపించిపోయేవి. కనుల నీరు జలజలా కారేది. హృదయం రెక్కలాడిన పిట్టలా విలవిలా తన్నుకొనేది. భారత స్త్రీకి అంత కంటే దౌర్భాగ్యం నరకం ఇంకేముంటుంది.

తను తన కుటుంబాన్నీ, తల్లిదండ్రులనీ, బంధువులనీ అందరినీ కాదని నారాయణనే నమ్ముకొని అందరికీ దూరమైంది. ఏలాగయినా తాను ఓర్పు వహించి అతన్ని సక్రమ మార్గంలో పెట్టడానికి ప్రయత్నించాలి. అంతకంటే మరి మార్గం లేదు. మనసును రాయి చేసుకుంది. మౌన మూర్తిలా అత నేమన్నా నోరుకదపక లేని నవ్వును తెచ్చుకోవడానికి వృధా ప్రయాస పడేది. తాను కుట్టుపని నేర్చుకుంది. కొద్దోగొప్పో సంపాదిస్తున్నది. ఆ వచ్చిన దానితోనే గుంభనగా ఇంటిని నడుపుతున్నది.

లోగడ అతనితో ఆవేశంతో మాట్లాడేది గానీ ఇప్పుడు అదేం లేదు. అతని కెంతో సేవా శుశ్రూషలు చేస్తూ అతి వినయముగా నడచుకొంటున్నది.

కానీ నారాయణలో ఏమీ మార్పు రావటం లేదు. ఎలాగయినా ఆమెను వదిలించుకోవాలన్న భావం అతనిలో మరింత దృఢమైంది. ఆమెలో ఏదైనా పొరపాటు దొరుకుతుందేమోనని చూస్తున్నాడు నారాయణ. అతనికి చిన్న నౌకరీ దొరికింది. కాని ఆ వచ్చేది అతని జల్సాంకే సరిపోయేదికాదు. ఇంటికి కావలసినవి ఏమీ తెచ్చేవాడు కాడు.

జీవి ఆశించేది ఒకటి. జరిగేది మరొకటీను. దేనిమీద ఆశలు పెట్టుకొని లవు జీవితాన్ని ఉజ్జ్వలవంతంగా చేసుకోవాలను కుంటారో అదే ఆ ప్రాణిని అతఃపాతాళానికి త్రొక్కివేయుడానికి ప్రయత్నిస్తుంది. ఈ సంఘర్షణ సృష్టిలోనే ఉంది. ఆ ప్రయత్నాలను అధిగమించి నూటికి, కోటికీ ఎవరో ఒకరు మాత్రమే తమ లక్ష్యాన్ని సాధించడం జరుగుతుంది. అల్ప విషయం కావచ్చు. అనంత విషయం కావచ్చు. సృష్టి రహస్యమే అంత. కొన్నికొన్ని విషయాలు సఫలీకృత మవడానికి ఏమాత్రం అవకాశం ఉండదు. ఇది ఎక్కువ స్వార్థపరమైన విషయాలకు అతికినట్టు సరిపోతుంది. కారణం ఆ—విషయం పరిమితమై ఇతరుల సానుభూతి ఏమాత్రం లభించక పోవటమే. ఇదొకరకమైన స్వార్థం. అదే పదిమందికీ వర్తించేదయితే ఒకరు కాక పోయినా మరొకరైనా సానుభూతి, సహకార భావం చూపడం జరుగుతుంది.

అలాగే ఆమె స్థితి అయింది. తన విషయాన్ని తానే చక్కదిద్దుకోవలసి వచ్చింది. అంతేగాదు. తన మీదకు వచ్చే పెనుగాలులను కూడా ఎదుర్కోవలసి వచ్చింది.

సమాజంలో పురుషునికి ఒక ప్రత్యేక

స్థానం ఉంది. అతను ఏమి చేసినా సంఘం తెలిసీ క్షమిస్తుంది. ఆదే స్త్రీ విషయంలో అలా క్షమించడం జరగదు. జీవితాంతం ఆమె ఆ బాధతో క్రుంగి కృశించవలసిందే. ఆమె మానవత్వపు విలువను నిర్ణయించి వేస్తుంది. అందుకు గుర్తుగా అనేక పేర్లు పెడుతుంది. అయినా స్త్రీ ఏమీ చేయడానికి దారిలేక ఒక వేళ ఉన్నా సహించి తలవంచుకొని వూరుకుంటుంది. కొందరు మరింత దిగజారడం సహజమవుతుంది. దేన్నయితే, ఎవర్నయితే నమ్ముకుందో దానికోసం వారికోసం జీవితాంతం పోరాడుతుంది. అందుకు ప్రాణాన్ని సహితం ఒడ్డడానికి వెనుకంజ వేయదు. తను నమ్ముకున్నవాడు తనను రాచి రంపాన పెడుతున్నా, అనేక విధాల హింసిస్తున్నా అతన్నే దేముడులా తలచి పాదపూజ చేసి అతని అడుగులకు మడుగు లొత్తుతూ అతనికి ఏమాత్రం బాధ కలుగకుండా ఉండడానికి శతథా ప్రయత్నిస్తుంది.

నారాయణ ఎంత హింసిస్తున్నా సహిస్తూ అతని మెప్పుకోసం ప్రాకులాడింది. అతను ఛీ, ఛీ, అని అన్నా, కాదు, నీవు నాదేవుడవు అంది. కానీ నారాయణ హృదయం చలించలేదు. ఆమె అంటేనే అతనికి గిట్టకపోవుట జరుగుతున్నది. రోజు రోజుకూ ఏహ్యభావాన్ని ఆమెపై ప్రదర్శిస్తున్నాడు. నీ మూలంగానే నా జీవితం నాశనమైపోతున్న దంటాడేగాని ఆమె జీవితం తన మూలంగానే సర్వనాశన మౌతున్నదని అతను ఏమాత్రం ఆలోచించలేకపోయాడు. ఆమె దైన్యవదనాన్ని చూచి అతని మనస్సావంతయినా చలించలేదు.

నారాయణ తండ్రీ, అతని బంధువులలో కొందరు అప్పుడప్పుడూ నారాయణను కలుసుకొని 'నీవు ఈ పీడ వదిలించుకోరా నాయనా! నీకేం నిక్షేపంలాంటివాడవు, ఇలా అయిపోతున్నావు. దీని బాబులాంటి పిల్లలను తెచ్చి వివాహం చేస్తాం. కావలసిన కట్నం కూడా వస్తుంది. దీంతో నీవేం బావుకుందామని?' అని హితబోధచేసి వెళ్లుతుండేవారు. వారెంత రహస్యంగా చెప్పుకుంటున్నా అవి ఆమె గ్రహించగలిగేది.

నారాయణ క్రమక్రమంగా స్నేహితులను ఇంటికి తీసుకురావడం, వాళ్లను ఇంటి దగ్గరే వదలి తనెటోపోవటం, ఆ వచ్చిన వాళ్ళు ఆమెను సరసాలకు దింపడానికి ప్రయత్నించడం, చిరునవ్వులు చిందిస్తూ, ఏవో ఆశలురేపే ప్రసంగం చేస్తూ ఆశగా ఆమెవంక చూడడం జరుగుతున్నది. వాళ్లకు తన దైన్య గాథను చెప్పి సూటి పోటీగా వాళ్ల ప్రవర్తనను నిందిస్తూ పంపించేది.

ఉన్నటుండి నారాయణ మాయమైనాడు. వారం తిరిగినా అతని జాడలేదు. అతను తన ఇంటికే వెళ్లిపోయినట్లు అతని మిత్రుడొకడు వచ్చి చెప్పాడు. అంతేగాదు— హాయిగా తనతో ఉండమనీ, అతనుపోతే పోయాడులే నీకు ఏలోటూ రాకుండా పువ్వుల్లో పెట్టి చూచుకుంటానని అంటూ ఉంటే ఆమె నిర్విణ్ణురాలైంది. శిలా ప్రతిమలా చలనరహిత అయింది. శ్వాస ఆగిపోయిందా అన్నట్లు ఆ వచ్చినవాడు గాబరా పడడం కూడా జరిగి పలాయనం చిత్తగించాడు.

ఇక తన జీవితం ఏమలుపుల్లో పోతుందో. ఎలా తన జీవితాన్ని సాగించటం. ఒంటరి స్త్రీ. అతనిలాగే తనూ తన ఇంటికి వెళ్లితే కుక్కను తరిమినట్లు తరిమేస్తారు. మొహాన్ని రెండు చేతులతో కప్పుకొని గోడకు చేరగిల బడింది. అతను తన తప్పును ఏనాటికయినా తెలుసుకొని తనను ఆదరిస్తాడా? ఒక వైపు మనసుకు ఆలోచన కలిగింది. ఇంత అన్యాయం జరుగుతుంటే ఎవరూ ఏమిటని కన్నెత్తయినా చూడడంలేదు. ఇదేనా ప్రపంచం. ఇలా తనలా ఎన్ని జీవితాలు ఈ ప్రపంచంలో ఆహుతైపోతున్నాయో! తనలా ఎవరూ నాశనం కాకూడదు. గది గోడలు దద్దరిల్లేలా కేకవేసింది. కన్నీరు మున్నీరుగా కళ్ళు కాయలు కాచేట్లు ఏడ్చింది. ప్రయోజన మేముంది? నారాయణకు ఉత్తరం వ్రాసింది—''నా జీవితాన్ని ధ్వంసంచేసి మీరు దూరమైనారు. ఒకసారి వచ్చి నన్ను శాశ్వతంగా ఈ ప్రపంచాన్నించి మారం చేయండి— నాగొంతు నులిమేసి చంపేయండి— ఆనందంగా మీ చేతుల్లో ప్రాణాలను వదులుతాను'' అతని నుండి జవాబు రాలేదు.

ప్రతిరోజు ఆశగా అతని రాకకొరకు చూసేది వ్యర్థమని తెలిసీకూడా. తన తల్లిదండ్రులకు తన జాడ అవసరమే లేకపోయింది. చచ్చిపోయినదాని క్రింద జమకట్టుకొని గుండె రాయి చేసుకొని వూరుకున్నారు. ఒకనాడు బిడ్డపై మమకారంతో తల్లి ఆమె దగ్గరకు రా ప్రయాణమైతే గౌరవ ప్రతిష్ఠతులు, అభిమానం అడ్డు వచ్చి ఆమెను వెళ్లనీయలేద తండ్రి.

రోజులు బరువుగా దొరలిపోతున్నాయి. అష్ట కష్టా లనుభవిస్తూ ఎలాగయితేనేం కుట్టు యంత్రం కొనుక్కున్నది. దానితోనే మోడువారిన జీవితంలో చిగుళ్ళకోసం వెదకుతున్నట్లు భారంగా రోజులు గడుపుతున్నది. ఎడారిలో ఎండమావులను నీళ్ళని భ్రమిస్తూ నారాయణ రాకకొరకు ఎదురు చూసేది.

నారాయణ మిత్రులు ఆమె దగ్గరకు వచ్చి సానుభూతిని ప్రకటిస్తున్నట్లు అభినయిస్తూ పరామర్శిస్తూ ఆమెను పెడదారిని పట్టించడానికి తగినన్ని ప్రయత్నాలు చేస్తుండేవారు. అత్యంత చనువుగా, హితులుగా ప్రవర్తిస్తూ ఆమెను పొందటానికి కపట నాటకం ఆడేవారు. ఆమె వాళ్ళను చూచి హీనంగా నవ్వుకొనేది. వాళ్ళకి సద్బుద్ధి కలగాలని కోరుకొనేది. వాళ్ళెంత కపట నాటకం ఆడుతున్నా సోదర వాత్సల్యంతో వాళ్ళను చూచేది. వారి ప్రలోభాలకు, ఆశలకు ఈషణ్మాత్రం ఆమె హృదయం చలించలేదు.

అచట ఉండటం ఇక అంత శ్రేయస్కరం కాదనుకొంది. వెంటనే ఈ వూరు వచ్చింది. బట్టలు కుడుతూ జీవచ్ఛవంలా, ఎందుకు బ్రతుకుతున్నానా అన్నట్లు రోజులు గడిపింది. ఒంటరి స్త్రీని ఏ విధంగా సత్కరించాలో తెలిసిన కొందరు పెద్దలు ఆమెపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. సాటి మహిళను ఏ విధంగా ప్రచారంచేసి కట్టుకథలను అల్లాలో తెలిసిన కొందరు స్త్రీలు ఆ పని కూడా ప్రారంభించారు.

సమాజంలో ఇలాంటి స్త్రీల భవిష్యత్తు ఎంత అంధకారమయంగా, భయంకరంగా ఉంటుందో మన కీమే ప్రత్యక్ష సాక్షి. అన్నిటనీ విని సహనంతో వూరుకొనేది. ఏమని జవాబు చెబుతుంది. దుష్ప్రచారాలకు?? అయితే సమాజంలో అందరూ కుత్సితులూ, దుష్ట స్వభావులే ఉండరు. కొందరు ఆమె స్థితిని అర్థం చేసుకొని సాంత్వన కలుగజేస్తూ సానుభూతి చూపెడుతూ పీడిత హృదయానికి కొంత ఉపశమనం కలుగజేసేవారు. అదే లేకపోతే ఆమాత్రమయినా శాంతిగా ఆమె జీవించి ఇంతకాలం ఉండగలిగేది కాదు.

ఇరుగుపొరుగు వారికి ఎవరికైనా అస్వస్థతగా యున్న ఆమె వెళ్ళి వారికి తన చేతనయిన సహాయం, ఉపచారం చేస్తుండేది. తీరిక సమయాల్లో తన కొచ్చిన చదువును పిల్లలకు చెబుతూ, కుట్టుపని కూడా నేర్పుతుండేది. ఈ విధంగా తన మంచితనాన్ని, సత్ప్రవర్తనను నిరూపించుకుంది.

నారాయణ వివాహమైంది. నారాయణ అత్తవారి వూరు కూడా అదేను. అతన్ని అత్తవారింటికి వచ్చినప్పుడు రెండు మూడు సార్లు దూరంగా ఉండి చూచింది. వెళ్ళి కాళ్ళకు చుట్టేసుకుని ఏడవాలనిపించింది. అతని కాళ్ళ వద్ద ప్రాణాలు విడవాలనుకుంది. కానీ అలా చేయలేకపోయింది. తన జీవితం భగ్నమైనా అతనయినా సుఖంగా ఉంటే చాలని రెండు చేతులా భగవంతుని ప్రార్థించింది.

ఆనా డెందుకనో అనిపించింది. చక్కగా సింగారించుకొని అత్తగారింటికెళ్ళే నవవధువులా ఉండాలని—అయింది. ముస్తాబై చీకట్లో బయలుదేరింది. ఆ వూరి చివరి దీపస్తంభం దగ్గరకు చేరుకుంది. ఇలా అయింది.

''అబ్బ'' బాధగా మూలిగింది.

ఆగంతుకుని హృదయం ఆర్ద్రమైంది. కన్నీరు దొరలింది. ఆపాదమస్తకం కంపించింది.

"బాబూ"

"ఆ......" దగ్గరగా వెళ్ళా డతను.

"ఎవరవు నీవు?" ప్రశ్నించాడు.

"దురదృష్టవంతురాల్ని బాబూ....పరిత్య క్తను......అపరాధను...... అవన్నీ అడక్కు బాబూ" మూలిగింది.

"ఆసుపత్రిలో చేరుస్తాను. ఊళ్ళోకెళ్ళి బండీ తీసుకువస్తాను" లేవబోయాడు.

"వద్దు బాబూ వద్దు......అంత శ్రమ వృథా.....మీరు చాలా దయగల బాబులులా ఉన్నారు......నా ప్రాణం నిలవదు. అయినా నాకు బ్రతుకుపై ఆశ కూడా లేదు.

"ఎందుకంత నిరాశ? బ్రతికితే బలుసా కైనా తిని బ్రతకవచ్చు" హితం చెప్ప బోయాడు.

"ఎందుకు బ్రతకడం.....బ్రతుకులో ఒక సార్థకత ఉండాలి. బ్రతకడాని కర్థం ఉండాలి. ప్రయోజనం ఉండాలి, ఆనందించడానికో లేదా ఎవరికోసమైనా....వారి పంచన బాధ పడనైనా పడాలి......నాకు అలాంటి వేమీలేవు.

నేననుకోలేదు. నా బ్రతుక్కి ఇంత త్వరగా ముక్తి లభిస్తుందని. భగవంతుడు నాకు శిక్షను తగ్గించాడు. . . . ఉశ్ఛ్వాస నిశ్వాసాలు తీవ్రమైనాయి. తీతువుపిట్టలు అరుస్తు న్నాయి. గుడ్లగూబలు కాకి గూట్లో చిన్ని కాకిపిల్లలను, వాటి / గుడ్లను నాశనం చేస్తుంటే తల్లి కాకులు అరుస్తున్నాయి. ఈశాన్యాన ఒక చుక్క రాలిపోయింది. అరుంధతీ జాలిగా ఆమె వైపే చూస్తున్నది. పవనుడు విషాదంగా అడుగులో అడుగు వేసుకుంటూ, తలవంచుకొని వెళుతున్నాడు.

ఆగంతుకుడు ఆమె మొహంలోకి పరీ క్షగా చూశాడు. ఎక్కడో చూచిన మొహంలా అనిపించింది.

మీ దివూరేనా బాబూ?—అస్పష్టంగా ప్రశ్నించింది.


కళ్ళు పెద్దవి చేసి అతని మొహంలోకి పరీక్షగా చూస్తున్నది. 'లక్ష్మి ? అస్పష్టంగా, అప్రయత్నంగా అన్నాడు.

ఆమె కళ్ళు మెరిశాయి. మొహంలో ఆనందం వచ్చింది. 'నా . . రా . . యు . . ణా' రెండు చేతులూ అతని మొహం మీదకు పోనిచ్చింది.

'లక్ష్మీ,' అంటూ గుండెల్లో బల్లేల్ని ఎవరో దిగేసినట్లు బాధ పడ్డాడు.

'నిజంగా నారాయణవే . . నేను అదృష్ట వంతురాల్ని . . ఈ చివరి క్షణాల్లోనైనా నిన్ను చూడగలిగాను. నీ సమక్షంలో . . నీ చేతుల్లో ఆనందంగా ప్రాణం విడిచే అదృష్టం ప్రసాదించాడు దేవుడు నాకు" అంటూ అతని చెంపలపై చేతులు వుంచింది.

"లక్ష్మి . . లక్ష్మి . .లక్ష్మి ! ! ! క్షమించు లక్ష్మి . . " వేయి లోయలు ప్రతిధ్వనిం చాయి అతని కేకలకు. కాని, ఆమె ఈ మాటలు వినబడని లోకానికి వెళ్ళిపోయింది ★



"వసంతం"